క్లుప్తంగా

ఆర్థిక సాయం



తెనాలి అర్బన్: ఓ నిరుపేద కుటుంబానికి మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, 15వ వార్డు కౌన్సిలర్ కోటేశ్వరరావు రూ.ఐదు వేలు ఆర్థిక సాయం మంగళవారం అందించారు. చినరావూరుకు చెందిన కంద్రు పరమేశ్వరరావు(50) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోటేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు ఇచ్చారు.

14 నుంచి జరిగే నిరసన యాత్రలో పాల్గొనండి



తెనాలి అర్బన్: బీజేపీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 14నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రచార యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని సీపీఎం పట్టణ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి రోజు రైల్వేస్టేషన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



తెనాలి: మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక శివాజీ చౌక్‌లో మినరల్ వాటర్‌తో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మంగళవారం ప్రారంభించారు. తొలి రోజున మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, వార్డు కౌన్సిలరు కొర్రపాటి లక్ష్మి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, కన్నెగంటి మురళి, షేక్ ఖాదర్‌బాషా, ఆదినారాయణ, హనుమారెడ్డి, చలమయ్య పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వాహకుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేశారు. లాలాపేట పోలీసులు పోలీసులు తెలిపిన వివరాలు... ఏటుకూరు రోడ్డులో కొందరు సింగిల్ నంబరు ఆట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేశారు. షేక్ సలీం, పఠాన్ మగ్బుల్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.190 స్వాధీనం చేసుకున్నారు.

పాలిసెట్ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై మే 10న నిర్వహించనున్న ఏపీ పాలిసెట్–2023 మహిళా అభ్యర్థులకు గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి మే 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే తరగతులకు హాజరు కాగోరు ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాలలో నేరుగా సంప్రదించాలని కోరారు.

విశ్రాంత ఉద్యోగిని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: విశ్రాంత ఉద్యోగితో స్నేహంగా మెలుగుతూ రూ.67 లక్షలు కాజేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. జేకేసీ కాలేజీ రోడ్డులో నివసించే విశ్రాంత ఉద్యోగి వీరబ్రహ్మేశ్వరరావు నివాసం ఉంటున్నాడు. చిల్లర వెంకటేశ్వరరావు అనే వ్యక్తి బ్రహ్మేశ్వరరావుతో స్నేహంగా మెలుగుతూ మాయమాటలు చెప్పి చెక్‌బుక్ తీసుకుని ఫోర్జరీ సంతకాలు చేసి బ్యాంకు నుంచి బ్రహ్మేశ్వరరావు అకౌంట్‌లోని రూ.67 లక్షలు డ్రా చేశాడు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అనంతరం మంగళవారం నిందితుడు వెంకటేశ్వరరావును అరెస్టు చేసి ల్యాప్‌ట్యాప్, కొన్ని చెక్కులు, రూ.55 వేలు, రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ స్వాధీనం చేసుకున్నారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

గుంటూరు ఈస్ట్: మహిళపై కత్తితో దాడిచేసిన వ్యక్తిని పట్టాభిపురం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. విద్యానగర్ 3వలైనులో నివసించే అక్కినేని సౌజన్యను ఈనెల 3వ తేదీ ఇంట్లో పనిచేసే నూజివీడుకు చెందిన ఎం.వెంకటేష్ కత్తితో పొడిచి గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు.

కరోనా చికిత్సకు జిల్లా ఆస్పత్రి సన్నద్ధం

- తెనాలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్
- హాజరై సమీక్షించిన వైద్యవిధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు, డెప్యూటీ డీఎంహెచ్ఓ అన్నపూర్ణ



తెనాలి ఆస్పత్రిలో మాక్ డ్రిల్‌లో డాక్టర్ జె.హనుమంతరావు, డాక్టర్ అన్నపూర్ణ తదితరులు

తెనాలి: దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. కేంద్ర ఆదేశాల మేరకు సోమ, మంగళవారాల్లో ఆస్పత్రుల్లో కరోనా సన్నద్ధతపై మాక్ డ్రిల్ నిర్వహించారు. కరోనా పరీక్షల కోసం ఏర్పాట్లు, రోగుల కోసం ప్రత్యేక వార్డులు, లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ ట్యాంకులు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, వెంటిలేటర్స్, మందులు, రాపిడ్ యాంటిజెన్ కిట్లు ఎంతవరకు ఉన్నాయనేది పరీక్షించి, సమీక్షించారు.

ఈ క్రమంలోనే తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌లో వైద్యవిధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటరు డాక్టర్ జె.హనుమంతరావు, డెప్యూటీ డీఎంహెచ్ఓ ఈ.అన్నపూర్ణ పాల్గొన్నారు. జిల్లాలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తర్వాత అతి పెద్దదైన తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా సెకండ్ వేవ్‌లో ఆక్సిజన్ కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ అనుభవంతో లిక్విడ్ ఆక్సిజను ప్లాంటు సామర్థ్యాన్ని 10 కిలోలీటర్లకు పెంపుదల చేశారు. గాలి నుంచి నిముషంలో వెయ్యి లీటర్ల ఆక్సిజనును తీయగలిగిన పీఎస్ఏ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆయా ప్లాంట్ల పరిస్థితిని తనిఖీ చేసి, సంతృప్తిని వ్యక్తం చేశారు. అవసరమైన పక్షంలో కరోనా రోగులకు నాలుగంచెల్లో ఆక్సిజను అందించగల సామర్థ్యం ఉందని డాక్టర్ హనుమంతరావు వెల్లడించారు. ప్రతి పడకకు ఉన్న ఆక్సిజను పైప్‌లైను పనితీరును పరిశీలించారు. గతంలో జిల్లాలో చేసిన కరోనా పరీక్షలను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోనే విశ్లేషించేవారు. జిల్లామొత్తం నుంచి భారీ సంఖ్యలో వచ్చే పరీక్షలను విశ్లేషించి పాజిటివ్/నెగటివ్ వెల్లడికి 2–4 రోజులు పట్టేది. కాలయాపన నివారించి ఎక్కడికక్కడే పరీక్షలు చేసి, ఫలితాలను సత్వరం ఇచ్చేందుకు నరసరావుపేట, తెనాలి ఆస్పత్రుల్లో వీడీఆర్ఎల్ లాబొరేటరీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనిని కూడా డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అన్నపూర్ణ పరిశీలించారు. కావాల్సిన ఎక్విప్‌మెంట్ సిద్ధంగా ఉందని చెప్పారు. వీడీఆర్ఎల్ ల్యాబ్‌ను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని, టెస్టింగ్ కిట్లు కూడా ఉన్నట్లు వివరించారు. అవసరమైతే మరిన్ని తెప్పిస్తామన్నారు. అప్పటికప్పుడు కరోనా కేసులు పెరిగితే తగిన పరీక్షలకు, చికిత్సలకు సర్వసన్నద్ధంగా ఉన్నామని వెల్లడించారు. వీరితో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి ఉన్నారు.

జ్యోతిరావు పూలే చిరస్మరణీయుడు

మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్



పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలి అర్బన్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన గొప్పవ్యక్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ కార్యాలయంలో జ్యోతిరావు పూలే మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలకు విద్యనందించడంతో పాటు ఆత్మస్థైర్యాన్ని కల్పించేందుకు, వారి హక్కులను కాపాడేందుకు అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆనాటి రోజుల్లోనే మహిళా సాధికారతకు అడుగులు పడ్డాయని గుర్తు చేశారు. పూలే స్ఫూర్తితో రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. అణచివేతకు గురైన పేదలకు ఆయన అండగా ఉండేవారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో భట్టరాజు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాళ్ళబండి సుష్మ, కౌన్సిలర్ ఆవుల కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కొడాలి క్రాంతి, అక్కిదాసు కిరణ్, కుర్రా శ్రీను, పెదలంక వెంకటేశ్వర్లు, షేక్ మీరావలి, పినపాటి నీరంజన్, పెసర్లంక రమణ, కాళిదాసు వెంకటసత్యం, దొడ్డక సాంబశివరావు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సేవా సంఘ నాయకులు



కొల్లిపర మండలపరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి

•పూలే జయంతిని ఏపీ నవచైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పూలే గొప్ప సంఘ సంస్కర్తగా అభివర్ణించారు. కుల నిర్మూలన కోసం మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కందుల సాంబశివగౌడ్, కొడాలి సుబ్రహ్మణ్యం, భీష్మ పాములు, రిమ్మనపూడి నరసింహారావు, టి.రాఘవ, నల్లగొర్ల గంగాదేవి, దానబోయిన సురేష్, ఆరాధ్యుల కన్నా, పాల్గొన్నారు.

కొల్లిపరలో..

కొల్లిపర: సమాజంలో అంటరానితన్నాన్ని నిర్మూలించి సంఘసంస్కర్తగా సమసమాజ స్థాపనలో బావితరాలకు నిత్యస్ఫూర్తి ప్రదాతగా నిలిచిన గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎంపీపీ భీమవరపు పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పద్మావతి, ఎంపీడీవో పి.శ్రీనివాసులు, ఆర్ఐ శ్రీనివాసరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెనాలి టౌన్: రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ఐక్యవేదిక కార్యాలయంలో సేవా ట్రస్ట్, అంబేడ్కర్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిదాసు కిరణ్‌కుమార్, బీసీ నాయకులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కొడాలి క్రాంతికుమార్, ఐక్యవేదిక రూరల్ అధ్యక్షుడు కుర్రా జశ్వంత్ కృష్ణ, సాపాటి కిరణ్, పినపాటి నీరంజన్, కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, ఉన్నవ సల్మాన్, ఎస్.రవిచంద్ర, దండమూడి సతీష్, ఎం.లక్ష్మీనారాయణ, కె.సతీష్, కనపర్తి సుధాకర్, శశి, శరత్, తదితరులు పాల్గొన్నారు.



ఐక్యవేదిక కార్యక్రమంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

•తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం ప్రగడికోటనగర్‌లోని కల్యాణ మండపంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, జగ్గడిగుంటపాలెం అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు గోలి లక్ష్మీనారాయణ, జొన్నాదుల నరసింహారావు, కొడాలి క్రాంతికుమార్, శివరామకృష్ణ, దామర్ల సుబ్బారావు, కొడాలి శ్రీను, మురళి, గోపి, పి.శ్రీనివాసరావు, అంజయ్య, నారాయణ, నాగమల్లేశ్వరరావు, వెంకట శివప్రసాద్, బిట్రా వెంకట్రావు, నాగేశ్వరరావు, కాగితాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రగడికోటయ్యనగర్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘ నాయకులు

కొనసాగుతున్న జగనన్నే మా భవిష్యత్



అవగాహన కల్పిస్తున్న మన్నవ ప్రభాకర్

తెనాలి అర్బన్: పట్టణంలోని అన్ని వార్డులో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. 19వ వార్డులో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం తెనాలి పట్టణ ఇన్‌చార్జి మన్నవ ప్రభాకర్ హాజరయ్యారు.

మండల గ్రామాల్లో..

తెనాలి టౌన్: కఠెవరంలో టీడీపీ నాయకుడు మైలా బసవ శంకరరావు ఇంటికి కన్వీనర్‌లు వెళ్లి ఆయనతో మాట్లాడి ఆయన ఇంటి గోడకు స్టిక్కర్ అంటించి పోస్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మైలా భానుప్రసాద్, కన్వీనర్‌లు తమ్మా శివారెడ్డి, ఎల్‌బిసి చిన్ని, షేక్ ఆదం షఫీ, మాజీ ఉపసర్పంచి మంచాల శ్రీనివాస్ పాల్గొన్నారు. పెదరావూరు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో మండల కమిటీ ఇన్‌చార్జి మహమ్మద్‌ఫరీద్, సర్పంచి కుంభం బాలాజీ ఇంటింటికి వెళ్లి గోడలకు స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాజా భద్రావతి పాల్గొన్నారు.

అలరించిన సందేశాత్మక, హాస్య నాటికలు



గమ్యస్థానాల వైపు నాటికలోని దృశ్యం

నగరంపాలెం: స్థానిక కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్‌లో కైకాల సత్యనారాయణ/ తమ్మారెడ్డి చలపతిరావు కళా ప్రాంగణంపై వైష్ణవి ఫిలిమ్స్, కళా విపంచి, గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, గుంటూరు ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాసాధ అధ్యక్షులు బి.వేదయ్య, ఎల్‌వీఆర్ క్లబ్, రీడింగ్ రూమ్ కళలు, వైజ్ఞానిక సాంస్కృతిక విభాగం పాలకవర్గ సభ్యులు రామ కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 17 వరకు నాటకోత్సవాలు కొనసాగుతాయని, బుధవారం హైదరాబాద్ వారి గ్రహణం, పొన్నూరు వారి కాపలా నాటికలు ప్రదర్శితమవుతాయని అన్నారు. వై.కే.నాగేశ్వరరావు ద్వితీయ నాటకోత్సవాల్లో భాగంగా గోపరాజు దర్శకత్వం వహించిన కొలకలూరి ఆర్ట్స్ వారి గమ్యస్థానాల వైపు అనే నాటిక సందేశాత్మకంగా ప్రదర్శించారు. అనంతరం పండు క్రియేషన్స్ వారి గోవిందరాజుల నాగేశ్వరావు రచించగా, బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన కొప్పోలువారి పక్కింటి మొగుడు అనే హాస్య నాటిక ప్రేక్షకులను అలరించింది.

ఘనంగా శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పూజా కార్యక్రమాలు



సరస్వతి స్వామి నుంచి అనుగ్రహ భాషణం పొందుతున్న మాదల రత్నగిరిబాబు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని కంచి కామకోటి పీఠ పాలిత వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో భారతీ ధార్మిక విజ్ఞాన్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం కంచి కామకోటి శంకరాచర్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామి మహాత్రిపుర సుందరీదేవి సమేత చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పూజలు, చండీయాగం, స్వామి అనుగ్రహ భాషణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు జరుగుతాయని జనచైతన్య హౌసింగ్ ప్రై.లిమిటెడ్ డైరెక్టర్ మాదల రత్నగిరిబాబు తెలిపారు. కార్యక్రమంలో జనచైతన్య హౌసింగ్ ప్రై.లిమిటెడ్ డైరెక్టర్ మాదల శకుంతల, ఎండీ మాదల సుధాకర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రధాన పోస్టాఫీసులో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరంలో కొల్లూరు రమేష్, డాక్టర్ శారద ప్రభృతులు

తెనాలి: తెనాలి పోస్టల్ డివిజన్, డీ3, శారద సర్వీసెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కొత్తపేటలోని ప్రధాన పోస్టాఫీసులో వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు బీపీ, మధుమేహం, ఈసీజీ, స్త్రీలకు రొమ్ము పరీక్షలు పరీక్షలను సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఎక్కువగా గుండెపోటుతో మరణాలు సంభవిస్తున్నట్లు గుర్తుచేశారు. కోవిడ్ నుంచి కోలుకున్న తర్వాత వచ్చే సమస్యలు, గుండె, ఇతర అవయవాల పనితీరును ప్రభావితం చేస్తున్నాయని చెప్పారు. దీనిపై అవగాహన నిమిత్తం 25 సంవత్సరాలు పైబడినవారి పరీక్షలను చేసి, సమస్యలు ఏవైనా ఉంటే ముందుగానే హెచ్చరించి, తగిన జాగ్రత్తలు చెప్పడమే క్యాంప్ ఉద్దేశంగా వివరించారు. మూడు రోజుల పాటు శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు రమేష్ మాట్లాడుతూ, తెనాలి పోస్టల్ ఉద్యోగులు, ఏజెంట్లు, ఖాతాదారులు అంతా వైద్యశిబిరంలో ఉచిత వైద్యసేవలు పొందవచ్చునని తెలిపారు. 13వ తేదీన ప్రత్యేకంగా మహిళలకు వైద్యపరీక్షలు ఉంటాయని వివరించారు.

పౌరాణిక నాటక దర్శకుడు రాంబాబుకు సన్మానం



రాంబాబును సన్మానిస్తున్న రవికుమార్, ముకేష్ తదితరులు

తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం కథానాయకుడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం మాయాబజార్ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు, దర్శకుడు అడుసుమల్లి రాంబాబును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాటం రవికుమార్, సురకారపు ముకేష్, కటికం నాగరాజు, మోర్ల వెంకయ్య, గుర్రం గోపి, తోట నాగేశ్వరరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎస్.సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ఎం.రాఘవరావు, జి.ప్రసాద్, ఎం.వెంకట్, ఎన్.శ్రీనివాస్, సాంబశివరావు, ఎస్.సుబ్బారావు, శివరామకృష్ణ, యర్రు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బధిర బాలుడి ఆచూకీ గుర్తింపు

తండ్రికి అప్పగించిన పోలీసులు



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

తెనాలి రూరల్: తమ సంరక్షణలో ఉన్న బధిర బాలుడి ఆచూకీని పోలీసులు గుర్తించారు. తెనాలి మండలం పెదరావూరులో సుమారు 16 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని బధిర బాలుడిని గ్రామస్తులు సోమవారం గుర్తించి పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. బాలుడిని తమ సంరక్షణలో ఉంచిన రూరల్ పోలీసులు బాలుడి ఆచూకీని గుర్తించారు. బాలుడిది బాపట్ల జిల్లా నగరం మండలం ఉల్లిపాలెం గ్రామంగా గుర్తించారు. బాలుడి తండ్రి గురిందపల్లి ప్రసాద్ మంగళవారం స్టేషన్‌కు వచ్చి బాలుడి వివరాలు తెలియజేయగా ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు బాలుడిని తండ్రికి అప్పగించారు. ఎరుకలపూడిలోని మానసిక వైద్యశాలకు సోమవారం బైక్ మీద తన కుమారుడిని తీసుకొచ్చానని, తిరుగు ప్రయాణంలో బైక్ దిగిన బాలుడు కనబడకుండా పోయినట్లు ప్రసాద్ తెలిపాడు. బాలుడిని తిరిగి అప్పగించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ పంపిణీ అభినందనీయం

నగరంపాలెం: వాసవీ క్లబ్ గుంటూరు కింగ్స్/ వాసవీ క్లబ్ గుంటూరు క్వీన్స్ ఆధ్వర్యంలో గుంటూరు ఫ్యాన్సీ అసోసియేషన్ సౌజన్యంతో మంగళవారం కొత్తపేటలోని ఫ్యాన్సీ కల్యాణ మండపం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని డెప్యూటీ మేయర్ షేక్ సజీల ప్రారంభించారు. గత 13 రోజులుగా కొనసాగుతున్న పంపిణీ కార్యక్రమాన్ని ఆమె అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ షౌకత్, పట్టణ ఫ్యాన్సీ అసోసియేషన్ పీఎస్‌టీలు ప్రభాకర్, దామోదర్, విశ్వేశ్వరరావు, ఆర్ఎస్.మూర్తి, వెంకటేశ్, రంగచంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ఏఎన్‌యూ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ అంబేడ్కర్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల నుంచి అనూహ్య స్పందన లభించింది. విజేతలకు బుధవారం జరిగే డాక్టర్ అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకలలో బహుమతులు అందజేయడం జరుగుతుందని అధ్యయన కేంద్రం ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్ తెలిపారు.

షిరిడి సాయి వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి టౌన్: గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. యోగా సభ్యులు బండి కాంతారావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య, గోపాలరావు, అనూష, ఆశ్రమ నిర్వాహకులు సత్యనారాయణ, సుజాత పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు

తెనాలి టౌన్: రూరల్ మండలం నందివెలుగులోని మహర్షి దయానంద వృద్ధాశ్రమంలో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆశ్రమంలో సర్వే నిర్వహించారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ టి.రవికుమార్ మాట్లాడుతూ రోగనిరోధక శక్తి తగిన వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ ఉందన్నారు. ఆశ్రమంలో సెక్రటరీ కె.కల్యాణి, ప్రెసిడెంట్ కె.రవీంద్రనాథ్, కోశాధికారి కె.నరసింహారావు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న లారీకి జరిమానా

తెనాలి రూరల్: అధిక లోడుతో వెళుతున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం అత్తోట వద్ద అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం గుర్తించారు. లారీ యజమానికి రూ.ఎనిమిది వేల జరిమానా విధించారు.

కస్తూరిబా గాంధీకి నివాళి

తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ శాంతి ఆశ్రమంలో మంగళవారం కస్తూరిబా గాంధీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, యోగాచార్య పి.కుటుంబరావు, వి.నాగభూషణరావు, వై.కోటేశ్వరరావు, ఎల్.రవి పాల్గొన్నారు.

